కథ

వింధ్యవాసిని

# విమానాశ్రయంలో...

కంపెనీ పని మీద కాలిఫోర్నియాకు వెళ్లి మూడు వారాలు పని చేసి, ఫ్లోరిడాలో ఉన్న మా కూతుర్ని చూడాలని బయలుదేరాం. తను ఉద్యోగం చేసే డెల్రేబీచ్‌కు దగ్గరున్నది ఫోర్ట్‌లాడరడేల్ విమానాశ్రయం. అమ్మాయి శివాని విమానాశ్రయానికి వచ్చి మేం రిజర్వ్ చేసుకున్న హోంస్టేడ్ హోటల్‌కు తీసుకెళ్లింది. తనున్న పేయింగ్ గెస్ట్ గదిలో మేం తనను ఇబ్బంది పెట్టడం ఇష్టం లేక హోటల్లో బుక్ చేసుకున్నాం. మేమున్న వారం రోజులు మాతో కలిసి గడపడానికి తన ఫియాన్సీ కిశోర్ వచ్చాడు. అందరం కలిసి అద్దె కారు తీసుకుని ఓర్లండో వెళ్లి డిస్నీ ల్యాండ్, యూనివర్సల్ స్టూడియో, కెనెడీ స్పేస్ సెంటర్ అన్నీ చూసి సంతోషంగా గడిపాం. కిశోర్ వెళ్లిపోయాడు.

మేం తిరిగి కాలిఫోర్నియాకు వెళ్లి, అటు నుంచి ఇండియాకు బయలుదేరే రోజు వచ్చింది. ఆ వేళ సోమవారం, ఉదయం ఆరు గంటలకు శివాని మమ్మల్ని విమానం ఎక్కించడానికొచ్చింది. ప్రవేశ ద్వారం ముందు కారు ఆపి అందరం దిగాము. భుజం మీదున్న తన హేండ్ బ్యాగును నా భుజానికి మార్చింది. తను వాళ్ల డాడీ కలిసి మా బ్యాగేజ్‌ను (విమాన ప్రయాణాల్లో లగేజ్‌ను బ్యాగేజ్ అంటారు) ట్రాలీ మీదికి మార్చేశారు.

మమ్మల్ని లోపలికెళ్లమని, "నేనిప్పుడే కారు పార్క్ చేసి వస్తాను, మీరెళ్లండి లోపలికి" అని తను కారు స్టార్ట్ చేసి పార్కింగ్ వైపు వెళ్లిపోయింది. అప్పుడు గమనించాన్నేను నా భుజం మీదున్న తన బ్యాగు. అప్పటికి దాన్ని గురించి అంతేం పట్టించుకోకుండా లోపలికెళ్లి కూర్చున్నాం. ముందున్న ముప్పై ఐదు గంటల ప్రయాణాన్ని గురించి ఆలోచిస్తూ, ఫోర్ట్‌లాడర్‌డీల్ విమానాశ్రయంలో జన సందోహాన్ని పరిశీలిస్తూ కూర్చున్నాం.

అరగంట దాటింది. అమ్మాయి పత్తా లేదు. మా ముందర ఉన్న కౌంటర్ ముందు ఉన్న క్యూ అంతా కరిగి ఖాళీ అయింది. కౌంటర్‌లో ఉన్న క్లర్క్ మా వైపు ఆశ్చర్యంగా చూస్తున్నాడు, "మీకేం కావాలి, ఎందుకు బ్యాగేజ్ పెట్టుకుని కూర్చున్నారు, 'చెకిన్ చెయ్యటం లేదే" అని. టైం చూసుకున్నాము. మా విమానం బయలుదేరటానికి ఇంకో నలభై నిముషాలే ఉంది. అమ్మాయి జాడ మాత్రం లేదు.

"పద, మనమూ వెళ్దాం. టైమవుతుంది" అన్నారీయన. ట్రాలీ తోసుకుని ముందుకు వెళ్లాము. క్యూలో ఉన్నది మేమే కనుక రెండు నిముషాల్లో చెకిన్ అయిపోయింది. మేం సెక్యూరిటీ చెక్ చేసుకుని వెళ్లిపోవచ్చు. కానీ మా శివానీ బ్యాగునేం చేయాలో తోచలేదు. తెరచి చూశాం. అందులో తన ఇంటి తాళాలు, సెల్‌ఫోన్, పర్సు అందులో కొన్ని డాలర్లు, ఏ.టి.ఎమ్. కార్డు, క్రెడిట్ కార్డు అన్నీ ఉన్నాయి. మేం ముందుకెళ్లి తన బ్యాగు కూడా పట్టుకుని వెళ్లిపోతే, తను ఈ విదేశంలో, మొబైలు, ఇంటి తాళం, పర్సు, డబ్బు ఏం లేకుండా ఎలా ఇల్లు గానీ ఆఫీసుగానీ చేరుతుంది? పోనీ ఇంకా కాచుకుంటే, మేము మా ఫ్లైటు తప్పటం ఖాయం!

"ఏం చేద్దామండీ? ఫోనయినా చేద్దామంటే, అదీ ఇందులోనే ఉండిపోయింది" అన్నాను. "తనెప్పటికి కనిపిస్తుందో అప్పటికి ఇంకా ఆలస్యమయ్యేటట్లుంది. మనకు కాలిఫోర్నియాలో ఫ్లైటు తప్పుతుంది. ఎలా?"


ఇద్దరం ముఖాలు చూసుకుంటున్నాము. కానీ ఏం చెయ్యాలో తోచకుండా ఉంది. "పోనీ దీన్నిక్కడే వదిలేసి మనం వెళ్దామా?" అని మా వారి జవాబు కోసం చూడకుండా ధైర్యం చేసి అడిగాను ఎదురుగా కౌంటర్లో ఉన్నతన్ని. "మాతో మా అమ్మాయి వచ్చింది. గుండు ముఖం, బాబ్ చేసిన వెంట్రుకలు, కళ్లజోడు, సామాన్యమైన ఎత్తు, కాస్త బొద్దు, చామనచాయ, ఈ వర్ణనకు సరిపోయే అమ్మాయి వచ్చి అడిగితే ఈ సంచీని ఇస్తారా? దయచేసి ఇదిక్కడ పెట్టుకుంటారా?" అని సందేహంగా.

ఆశ్చర్యంగా అతను చిరునవ్వు నవ్వి బ్యాగు చేతికి తీసుకున్నాడు. (అదృష్టం కొద్దీ ఇది 9/11 కన్నా ముందు! లేకుంటే ఆ వ్యక్తి నేనిచ్చిన బ్యాగును అంత సులభంగా తీసుకునేవాడు కాదేమో! మేం ఏ భయోత్పాదకుల గుంపునకు సంబంధించిన వారమో కావచ్చు కదా?)

'అబ్బ' అని ఊపిరి పీల్చుకుని ఇద్దరం చేతి సంచులతో ముందుకు నడిచాం. సెక్యూరిటీ చెక్‌లో మా వారు ద్వారంలోంచి ముందుకు వెళ్లిపోయారు. నేను మాత్రం ప్రవేశద్వారంలోంచి నడుస్తోండగా, నా మోకాలులో ఉన్న 'ఆర్టిఫిషియల్ జాయింట్' గట్టిగా బీప్ చేసింది. కారణం చెప్పాను. అయినా వాళ్లు వదల్లేదు. అక్కడే ఆపేసి, ఒక ఆడ పోలీసును రప్పించారు. ఆవిడ చాలాసేపు ప్రత్యేకంగా ప్రశ్నలు, పరీక్షలు చేయడం మర్యాదగానే అయినా బాగా ఆలస్యమవుతోంది. అంతా అయ్యేసరికి అరగంట అయింది. వెళ్లి ఆయన్ని కలుసుకుని విమానం బయలుదేరే గేటు వైపు నడిచాను.

నాలుగడుగులు వేసేసరికి ఇంకొక అమ్మాయి ఎదురొచ్చి "మీరు కొద్దిలో మీ విమానం తప్పారు. ఇప్పుడే విమానం తలుపులు మూశాం" అని చెప్పేసి వెళ్లిపోయింది.





విచిత్రంగా మాకు ఆ వార్త నిరాశ కలిగించలేదు. "మంచిదే అయింది కదండీ?" అన్నానాయనతో.

"అవును. శివాని దగ్గరికి బ్యాగు చేరినా తను మనకు ఫోన్ చేయగలిగేది మనం ఇండియాకు చేరింతర్వాతే కదా?"

"అంతవరకూ మన గతేంటి! అదేమయిందనుకోవాలి? ఇప్పుడెలాగూ వెళ్లలేకపోయాం కనుక ఈ విషయం అమీతుమీ తేల్చుకోవచ్చు! మనం ఇక్కడ్నుంచీ బయటపడటం మనం ఫ్లైటు అందుకుని ఇండియాకు వెళ్లడం మాట తర్వాత!"

"దేవుడే మనకు మన అమ్మాయి సంగతి కనుక్కోకుండా వెళ్లొద్దని విమానం తప్పించాడు, కదండీ?" అన్నాను. సంతోషంగా మళ్లీ చెకిన్ కౌంటర్ దగ్గరికొచ్చాము.

మునుపున్న వ్యక్తే ఉన్నాడు. మా వారు ఇంక తనకు శక్తి లేనట్లు ఒక బెంచి మీద కూర్చున్నారు. ఆయన కళ్లలో తిరుగుతున్న నీటి వైపు చూసే ధైర్యం లేక ముందుకు కౌంటర్ వైపు నడిచాను. నేనేమీ అడగక మునుపే "ఎవరూ రాలేదు" అని బ్యాగు నా చేతికివ్వబోయాడు. సరిగా అప్పుడే ఎవరో కౌంటర్ మీదికి చాస్తున్న నా చేతిని ఎవరో మెల్లగా లాగుతున్నారు. ఇటు చూశాను. అక్కడుంది మా శివాని! "ఈమే మా అమ్మాయి" అని ఆ అపరిచితుడికి ఈమెను పరిచయం చేశాను సంభ్రమంగా. శివాని తన బ్యాగును చేతికి తీసుకుంది.

ఎవరు గట్టిగా పట్టుకున్నారో తెలీదు కానీ ఇద్దరం వదల్లేనట్లు చేతులు పట్టుకుని ముందుకు నడిచాం. "ఎక్కడికెళ్లావు మహాతల్లీ ఇంత సేపు? మా ఫ్లైటు కూడా తప్పిపోయింది తెలుసా?" అన్నాను కాస్త కోపంగా, చివరికి కనిపించింది కదా అని మనసు ఒక వైపు కుదుట పడుతున్నా! తను సమాధానం చెప్పేలోపు ఇద్దరం ఆయన దగ్గరికి చేరుకున్నాం. తండ్రీ కూతుళ్లిద్దరూ కౌగిలించుకుని ఏడవటం మొదలుపెట్టారు. నేను మాత్రం కాస్సేపు ఇద్దరి భుజాల మీద తడుతూ ఉండిపోయాను. ఆ క్షణంలో మేము అనుభవిస్తున్నది, ఉద్వేగమో, సంతోషమో, భయమో మాకే తెలీదు. అందరికీ మేం వెళ్లాల్సిన విమానం తప్పిన విషయం గుర్తొచ్చింది పది నిముషాల తర్వాత.

అందరం కలిసి ఒకేసారి మాట్లాడుతూ మేం కనుక్కున్నదిది. కారు తీసుకుని ఎన్నో అంతస్తులున్న ఏర్‌పోర్ట్ పార్కింగ్‌లో ఖాళీ స్థలం కోసం వెతుక్కుంటూ వెళ్లిన తనకు చాలాసేపటికి చోటు దొరికింది. కారు పార్క్ చేసిన తర్వాత మా దగ్గరికి బయలుదేరిన తనకు మేం విమానాశ్రయం ఏ ప్రవేశం దగ్గర లోపలికెళ్లామో గుర్తు రాలేదట. అందుకని అంతటా మా కోసం వెతికి అమెరికన్ ఏర్‌లైన్స్ వాళ్ల వివిధ కౌంటర్లలో చూసి, చివరికి ఇక్కడకి ఆమె చేరుకోవడానికి ఇంత సమయం పట్టింది. ఇది అమెరికా విమానాశ్రయాల్లో, అక్కడ విశాలమైన కార్ పార్కింగులో ఎవరయినా ఎదుర్కొనే సాధారణమైన సమస్య! తన బ్యాగును నా భుజానికేసుకుని వచ్చే తప్పు చేయ

కపోతే అందరికీ ఇంత ఆందోళన పడాల్సిన అవసరం ఉండేది కాదు.

అప్పుడు గుర్తొచ్చింది మా వారికి ఇప్పుడింకా మిగిలిన అసలు సమస్య! "అయ్యో, ఆ విమానంలో మన బ్యాగేజ్ ఉండిపోయింది?" అన్నారు. అది ఇంకొక రెండు గంటల్లో శాన్‌ఫ్రాన్సిస్కో విమానాశ్రయం చేరుతుంది.

"మీరెలాగయినా ఇంకొక విమానంలో సీటు సంపాదించుకుని సాయంత్రం లోపల శాన్‌ఫ్రాన్సిస్కో విమానాశ్రయం చేరి మీ బ్యాగేజ్ తీసుకోవాలి" అంది శివాని.

మమ్మల్నొక చోట కూర్చోబెట్టి అమ్మాయి శివాని మమ్మల్ని పంపించే దారి వెతకడానికి వెళ్లింది. మాకు తప్పింది అమెరికన్ ఎర్‌లైన్స్ విమానం. అందుకని మొదట వాళ్ల కౌంటర్‌కు వెళ్లి అడిగింది. మధ్యాహ్నం మూడు గంటల వరకూ వాళ్ల ఫ్లైట్సేమీ లేవట. వాళ్లదయితే మా వ్యర్థమైన టికెట్ల మీద కొత్త టికెట్ల మీద ధర ఏమైనా తగ్గుతుందేమో అని ఆశ. కానీ మూడు గంటల వరకూ కాచుకుంటే, కాలిఫోర్నియాకు సరైన సమయానికి చేరతామో లేదో నమ్మకం లేదు.

పది నిముషాలకు తిరిగొచ్చిన శివాని చెప్పింది. "వర్జిన్ ఎర్‌లైన్స్, యునైటెడ్ ఎర్‌లైన్స్, యు.ఎస్.ఎర్‌వేస్ అన్ని ట్రావెల్ కౌంటర్ల దగ్గరా విచారించాను మమ్మీ! డెల్టా ఎర్లైన్స్ వాళ్లది మాత్రం పది గంటలకు హ్యూస్టన్ మీదుగా చుట్టుకుని వెళ్లే రూట్ ఒకటుందట. టికెట్టు కాస్త ఎక్కువ"

"సరే! ఏం చేద్దాం. తప్పుతుందా?" అని మా వారు వీసా కార్డు స్వైప్ చేసి టికెట్లు కొన్నారు. అక్కడ ఖర్చయిన డాలర్లకు ఎన్ని రూపాయల బిల్ వస్తుందో ఇండియాకు వచ్చి, ముందు నెల వీసా స్టేట్‌మెంట్ చూస్తేగానీ తెలీదు.

ఏదో ఒక విధంగా వెళ్లటానికి దారి ఏర్పడింది కదా అన్న సంతోషంలో ఉదయం నుంచీ కడుపులో ఏమీ పడని మాకు ఆకలి గుర్తొచ్చింది. వాళ్ల తిండి తిని రుచించగల నాలుక, అరిగించుకోగల జీర్ణశక్తి, కొనడానికి డాలర్లు ఉంటే, అక్కడి ఎర్‌పోర్ట్‌లో తినడానికి బాగానే దొరుకుతాయి. ముగ్గురం మూడు క్రాసెంట్స్ తిని, స్టార్‌బక్స్ కాఫీలు తాగి ఆకలి తీర్చుకున్నాం.

టికెట్లు తీసి చూసింది శివాని. "మా! మనం వేరే టర్మినల్‌కు వెళ్లాలి" అని అంతా తన వల్లే వచ్చింది అన్నట్లు నేరస్తురాలిలా ముఖం పెట్టింది. ఒక కాలు ఆపరేషన్ అయిన నేను చేతితో కర్ర ఆధారంతో దూరాలు వెళ్లటం అంత సులువేం కాదు. "అయినా తప్పదు. చేసేదేముంది. పదండి" అన్నాను. ఉసూరుమనిపించినా పక్క టర్మినల్‌కు వెళ్లే బస్ కోసం బయటికొచ్చి నిలుచున్నాం.

ఒక బస్ వచ్చి ఆగింది. తలుపు దానంతట అదే తెరుచుకుంది. దాన్ని నడుపుతున్నది ఒక యాభై పైన వయసున్న ఆఫ్రికన్ అడ డ్రైవర్. తెరుచుకున్న తలుపు వెనుకే డ్రైవర్ సీటుంది. ఆమె మమ్మల్ని చూసి 'హలో!' అని నవ్వింది. నన్ను, నా కర్రను చూసి కాస్త ఆగమని సంజ్ఞ చేసి ఏవో బటన్లు నొక్కింది. బస్‌లోంచి ఒక ఆటోమాటిక్ పానల్ బయటికొచ్చింది. దానిమీది నుంచీ నడుచుకుని సులభంగా లోపలికి వెళ్లి బస్‌లో కూర్చున్నాం. నాకప్పుడు మా ఊళ్లో బస్ ఎక్కేటప్పుడు నేనెంత కష్టపడతానో గుర్తొచ్చింది.

మళ్లీ ఒక విడత కన్నీళ్లు, కౌగిలింతల వీడ్కోళ్లు అయ్యాక మేము డెల్టా విమాన ప్రవేశ ద్వారం గుండా లోపలికి నడిచాం. మా వెనుక చెయ్యి ఊపి వెళ్లిపోయిన మా అమ్మాయికి మళ్లీ మేం ఇండియా సురక్షితంగా చేరి తనకు ఫోన్ చేసి తెలిపేదాకా మనశ్శాంతి ఉండదని ముగ్గురికీ తెలుసు!

○



## షీనా జాక్‌పాట్

***ఇటీవల 'బిందాస్' సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన కుర్రతార షీనా ఇప్పుడు జాక్‌పాట్ కొట్టేసినట్టే అంటున్నారు సినీజనాలు. అల్లు అర్జున్ హీరోగా ఎంతో భారీగా నిర్మాణం కాబోయే 'బద్రీనాథ్' సినిమాలో నాయికగా షీనా ఎంపికయ్యే అవకాశాలు ఎక్కువగా వున్నాయిట. తొలిచిత్రంలోనే మంచి మార్కులు కొట్టేసిన షీనా గనక అల్లు అర్జున్‌తో నటించడానికి సెలక్ట్ అయితే ఆమె దశ తిరిగినట్టే మరి!***